వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 231 | సోమవారం | 18 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## బ్రహ్మోత్సవాలకు వేళాయే..



8లో

- భక్తుల కొంగు బంగారం కోటంచ నృసింహుడు
- ముస్తాబైన ఆలయం
- 19 నుంచి 27 వరకు ఉత్సవాలు
- 20న స్వామి వారి కళ్యాణోత్సవం
- ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ఎమ్మెల్యే, కలెక్టర్

# దొందు దొందేనా..!



- పార్టీ మారితే సచ్చీలురు అయినట్లేనా..?
- తొడగొట్టి చేసిన సవాళ్లపై చర్యలు శూన్యం
- ఎన్నికల ముందు చేసిన ఆరోపణలు ఉత్తిత్తివేనా
- అధికార పార్టీలోకి వస్తే కేసులుండవా..
- అప్పుడు బిఆర్ ఎస్..ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వలసలు
- ఛీ.. కొడుతున్న జనం

అసెంబ్లీ ఎన్నికల సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్, బీజేపీ నేతలను ఎండగట్టడంతో ప్రజల మెప్పును పొందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు వారినే పార్టీలోకి ఆహ్వానించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. అధికారంలోకి వస్తే వారి అక్రమాల చిట్టా విప్పుతానంటూ చేసిన ప్రకటనలు బుట్టదాఖలేనా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొడగొట్టి చేసిన సవాళ్లపై చర్యలేమిటంటున్నారు. వారు పార్టీ మారితే సచ్చీలుగా మారినట్లు అవుతుందా అంటున్నారు. స్కాములు చేసిన వారిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకుంటే వారి అవినీతి తుడిచి పెట్టుకుపోతుందా అంటూ ప్రశ్నిస్తున్నారు. పార్టీ మారే నేతలను రాళ్లతో కొట్టి చంపాలంటూ ఎన్నికల ముందు ప్రకటించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు గేట్లు తెరిచామంటూ ప్రకటించుకోవడంపై దేనికి సంకేతమంటున్నారు. అవినీతిపరులంతా కాంగ్రెస్ లో చేరేందుకు క్యూ కడితే మీ నిజాయితీని ఎలా నిరూపించుకుంటారంటూ ప్రశ్నిస్తున్నారు. అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ లోకి భారీ వలసలతో దొందూ దొందేనా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు 2లో..

## పకడ్బందీగా పది పరీక్షలు

### తనిఖీ చేసిన వరంగల్, హనుమకొండ కలెక్టర్లు



2లో..



## అధికారులు బాధ్యతతో పని చేయాలి

### రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య




8లో

## నీటి ఎద్దడిని నివారించాలి

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

### ధర్మసాగర్ రిజర్వాయర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ క్షేత్రస్థాయి పరిశీలన



2లో

# దొందు దొందేనా..!

## పార్టీ మారితే సచ్ఛీలురు అయినట్లేనా..?
## తొడగొట్టి చేసిన సవాళ్లపై చర్యలు శూన్యం
## ఎన్నికల ముందు చేసిన ఆరోపణలు ఉత్తిత్తివేనా..
## అధికార పార్టీలోకి వస్తే కేసులుండవా..
## అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ లోకి వలసలు
## ఛీ.. కొడుతున్న జనం


వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..


**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిన్న, మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలందరికీ కంటికి రెప్పలా కాపాడుకుంటామని, పార్టీ పదవుల్లో వారికే ప్రధాన భూమిక కల్పించడంతోపాటు వలసలను వ్యతిరేకిస్తున్నామంటూ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గేట్లు తెరిచామంటూ ప్రకటించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్లమెంట్ ఎన్నికల ముందు వ్యూహాత్మకంగా కాంగ్రెస్ గేట్లు తెరుచుకోవడంతో చేరికలు మొదలయ్యాయి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రంజిత్ రెడ్డిలు తొలి అడుగు వేశారు. ఇప్పటికే ఎంపి పసునూరి దయాకర్, కోరేరు కోనప్ప కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

### పార్టీ మారితే..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ ఎస్ నేతల అవినీతి, అక్రమాలపై గొంతెత్తిన సీఎం రేవంత్ రెడ్డి నేడు వారినే పార్టీలోకి చేర్చుకునేలా రెడ్ కార్పెట్ పర్చడంపై కాంగ్రెస్ పార్టీనే నమ్ముకున్న నాయకులతోపాటు సాధారణ ప్రజానీకం సైతం వ్యతిరేకిస్తుంది. అవినీతి పరుల భరతం పడతానంటూ పలు బహిరంగ సభల్లో రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్రమ సొమ్మును కక్కిస్తానంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చినప్పటినుంచి వంద రోజుల వరకు వలసలకు వ్యతిరేకంగానే రేవంత్ రెడ్డి వ్యవహరించారు. వంద రోజుల పాలన ముగియగానే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా గేట్లను ఎత్తివేవడంపై సర్వత్రా వ్యతిరేకత వస్తోంది. ఎమ్మెల్యేలుగా గెలిచిన అవినీతి పరులు కాంగ్రెస్ పార్టీలోకి రాగానే సచ్చీలురుగా మారుతారా అంటూ ప్రశ్నిస్తున్నారు. అవినీతి పరులను పార్టీలోకి రాకుండా అడ్డుకోవాలని, వారి అక్రమాల భరతం పట్టాలని డిమాండ్ వినిపిస్తోంది. లేకుంటే కాంగ్రెస్ పార్టీపై ఉన్న అవినీతి మరక రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభావితం చూపుతుందంటూ హెచ్చరిస్తున్నారు.

### విజయమే లక్ష్యంగా..

లోక్ సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించారు. కేసీఆర్ చూపిన తోవలోనే నడుస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం 2014లో టీఆర్ఎస్‌కు 63 మంది ఎమ్మెల్యేలే ఉండేవారు. దీంతో ప్రభుత్వ సుస్థిరతే లక్ష్యంగా కేసీఆర్ తెలుగుదేశం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకున్నారు. రాజకీయ పునరేకీకరణ అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ బలం కూడా 64 కావడం విశేషం. ఈ కారణంగా నాడు కేసీఆర్ చూపిన బాటలో ఇప్పుడు తాము కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే తప్పేమిటి అని కాంగ్రెస్ ముఖ్యులు ప్రశ్నిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం జంట నగరాలు, రంగారెడ్డి జిల్లాల నుంచి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లోకి వెళ్లారు. ప్రస్తుతానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. తమాషా ఏమిటంటే, గ్రేటర్‌లో గెలిచిన శాసనసభ్యులు అందరూ గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ తరఫున గెలిచి బీఆర్ఎస్‌లో చేరినవారే.


వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

### ఆ ముగ్గురే..

తాజా సమాచారం ప్రకారం పదిహేను మందికి పైగా బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌తో పాటు, రంగారెడ్డిలో బీఆర్ఎస్ అత్యధికంగా 39 స్థానాల్లో గెలుపొందింది. మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో ఆ ముగ్గురే మిగులుతారని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. అంటే ఆ ముగ్గురు తప్ప అందరినీ చేర్చుకునే కార్యక్రమం మొదలయ్యిందా అన్న ప్రచారం సాగుతోంది. లోక్‌సభ ఎన్నికలలోపే ఈ చేరికలు జరిగిపోతే భారత రాష్ట్ర సమితికి కోలుకోలేని దెబ్బ తగలడం ఖాయంగా ఉంది. ఫిరాయింపులకు గతంలో తెర లేపింది కేసీఆరే కనుక ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే పనిచేసినా వారిని ప్రశ్నించే నైతికత బీఆర్ ఎస్ శ్రేణులకు లేదు. ఈ పరిస్థితిని అనుకూలంగా మలచుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. 2014లో అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చినందున ఫిరాయింపులను ప్రోత్సహించినా కేసీఆర్‌ను ప్రజలు సమర్థించారు. 2018లో 88 స్థానాలను గెలుచుకున్నప్పటికీ ఫిరాయింపులను ప్రోత్సహించడాన్ని ప్రజలు ఆక్షేపించారు.

### మేం కాదంటే..

కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముందుకొచ్చే శాసనసభ్యులకు తలుపులు తెరవాలని ఆ పార్టీ నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు తాము ఆ పనిచేయకపోతే ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరిపోతారని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. దీంతో చేరికలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం పది స్థానాలను గెలవడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన లక్ష్యం. ఇన్ని సీట్లు గెలిస్తే తప్ప కాంగ్రెస్ పదిలంగా ఉండదు. ఇందుకోసం రేవంత్ రెడ్డి వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికలు తమ వందరోజుల పాలనకు రెఫరెండంగా ప్రకటించారు. గెలిచినా, గెలవకపోయినా తనదే బాధ్యతన్నారు.

### ఊపుమీదున్న బీజేపీ..

భారతీయ జనతా పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను మాత్రమే గెలుచుకున్నప్పటికీ ప్రస్తుతం మంచి ఊపు వీరేదే ఉంది. దక్షిణ తెలంగాణలో పార్టీ బలహీనంగా ఉన్న విషయాన్ని గమనించిన కమలనాథులు పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. ప్రజల్లో పట్టున్న నాయకులను గుర్తించి ఎంపీ అభ్యర్థులుగా బరిలో దించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఖమ్మం నుంచి జలగం వెంకట్రావ్, మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్‌ను పార్టీలో చేర్చుకున్నారు. గత ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు అంతకంటే ఎక్కువ సీట్లు గెలుచుకోవడం కోసం పావులు కదుపుతోంది. ఐదు, అంతకు మించి సీట్లు గెలుచుకోగలిగితే రాష్ట్రంలో బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరిస్తుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌ను బలహీన పరిచే కార్యక్రమంలో వారు కూడా అడుగులు వేస్తున్నారు. కవిత అరెస్ట్‌తో కేసీఆర్, ఆయన కుటుంబం ఆ వైపు దృష్టి సారించింది. ఇప్పుడు పార్టీలో ఏం జరుగుతున్నా పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాని మోదీ ఇప్పటికే తెలంగాణలో రెండు రోజులు ప్రచారం చేశారు. తెలంగాణలో బలపడితే ఆ తర్వాత ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించవచ్చునన్నది కమలనాథుల వ్యూహంగా ఉంది. తెలంగాణలో దూకుడు ప్రదర్శిస్తే మెజారిటీ సీట్లు గెలుచుకోవచ్చునని బీజేపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధాని మోదీ గ్లామర్ అదనపు బలం కనుక లక్ష్య సాధన అసాధ్యం కాదని వారు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థతకు గీటురాయి కానుంది. ఇందులో అసలు సిసలు విషమ పరీక్షను కేసీఆర్ ఎదుర్కోబోతున్నారు.

# పకడ్బందీగా పది పరీక్షలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. సోమవారం వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్నా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో మౌళిక సదుపాయాల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్ తో లోనికి ఎవ్వరిని అనుమతించవద్దని, డీఈఓ, చీఫ్ సూపరింటెండెంట్ ల నుంచి పరీక్ష విధుల్లో ఉన్న వారే కాకుండా, వైద్య శిబిర సిబ్బందితో సహా ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలన్నారు. ప్రహరి సరిగా లేని ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ వాసంతి, చీఫ్ సూపరింటెండెంట్ తదితరులున్నారు.

### హనుమకొండ..

పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల, షైన్ స్కూల్ లలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి అక్కడ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

# నీటి ఎద్దడిని నివారించాలి

## బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

## ధర్మసాగర్ రిజర్వాయర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ క్షేత్రస్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వేసవి కాలం దృష్ట్యా నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ధర్మసాగర్ రిజర్వాయర్ తో పాటు వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటి సరఫరా తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ ఇంటెక్ వెల్ ను పరిశీలించిన కమిషనర్ రిజర్వాయర్ నుంచి బల్దియా పరిధిలోని మూడు ఫిల్టర్ బెడ్ లకు నీరు చేరే విధానంతో పాటు స్థానికంగా ఉన్న ల్యాబ్ లో నీటి నాణ్యత నిర్ధారణ విధానాన్ని, క్లోరినేషన్ ప్రక్రియ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో దేవాదుల నుంచి ఎల్ ఎండీ, అక్కడినుంచి రిజర్వాయర్ లోకి నీరు చేరే ప్రక్రియను అధికారులు కమిషనర్ కు వివరించారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి గత 5 సంవత్సరాల నుంచి నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, నీటి సరఫరా విధానాలకు సంబంధించి బల్దియా తరపున ఎలాంటి సహకారం అవసరం ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ను సందర్శించి నిర్వహిస్తున్న నీటి శుద్ధీకరణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకొని ఫ్లో మీటర్ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాస రావు, డీఈలు సంతోష్, అజ్మీరా శ్రీకాంత్, మిషన్ భగీరథ డీఈ జీవన్, ఏఈఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మట్టేవాడ సీఐ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పదో తరగతి పరీక్షలు రాసేందుకు సోమవారం ఉదయం బ్యాంకు కాలనీలోని ఎస్సార్ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి వచ్చిన రామన్నపేటకు చెందిన సిలువేరు హనీ అనే విద్యార్థిని తాను చేరుకున్న పరీక్షా కేంద్రం సరైనది కాక ఆందోళన చెందింది. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న మట్టేవాడ పోలీసులు ఆ విద్యార్థి హాల్ టికెట్ ను పరిశీలించి పరీక్ష సమయానికి 5 నిమిషాలు మాత్రమే ఉండి సమయం మించిపోతుండడంతో సీఐ గోపి స్వయంగా తన పోలీస్ వాహనంలోనే తీసుకువెళ్లి విద్యార్థి రాయాల్సిన పాఠక్ మహల్ లోని ఎస్సార్ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి చేర్చారు. దీంతో ఆ విద్యార్థికి ఊపిరిపించుకున్నట్లయ్యింది. విద్యార్థి చివరి నిమిషంలో భావోద్వేదంతో ఉండటంతో ధైర్యం , అల్ ది బెస్ట్ చెప్పి మరీ పరీక్ష కేంద్రంలోకి సీఐ పంపించారు. సీఐ సకాలంలో స్పందించి తీరుకు తల్లిదండ్రులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఇనుగాలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ( కుడా ) చైర్మన్ గా నియమితులైన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని సోమవారం వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట నరసింహారెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ చోటు, రుద్వేగ్ తో పాటు తదితరులు ఉన్నారు.

## ఎంపీడీవోని సన్మానించిన కారోబార్లు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల నూతన ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్యాంసుందర్ ని సోమవారం మల్హర్ మండల కారోబార్లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కారోబార్ల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరగా సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు కారోబార్ల యూనియన్ మండల అధ్యక్షుడు కనుకుల శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో విక్రమ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు అజ్మత్ ఆలీ, ప్రధాన కార్యదర్శి నారా శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు జాలిగపు బాపు, శ్రీకాంత్, విజయగిరి బాపు, అజ్మీరా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

**వరంగల్ వాయిస్, మల్హర్ :** అప్పుల బాధతో ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు గాజుల శంకరయ్య చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గాజుల శంకరయ్య అప్పు చేసి 3 ఎకరాల చేను కౌలుకి తీసుకొని పత్తి సాగు చేయగా పత్తి దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు గాజుల కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఏఎస్సై కుమార స్వామి తెలిపారు.

# పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి

### సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కేంద్ర, రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికొచ్చీ రాగానే "పూసపల్లి కుట్ర కేసు"ను బనాయించిందని, ఇది అత్యంత దుర్మార్గమైనదని,ప్రజాపాలనగా చెప్పుకొంటున్న కాంగ్రెస్ పాలన బీజేపీ, బీఆర్ఎస్ పాలనల కొనసాగింపుకు నిదర్శనమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ బయ్యారం మైదాన మండల కార్యదర్శి మాదంశెట్టి నాగేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ రామగిరి భిక్షం అన్నారు. సోమవారం బయ్యారం గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం నాగేశ్వరరావు, భిక్షంలు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ తదితరులను ఖమ్మం సమీపంలో ఫిబ్రవరి 14న అరెస్టుచేసి, 17న రిమాండ్ చేశారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు పరిసరాలలోని పూసపల్లి వద్ద అరెస్టును చూపించిన రిమాండ్ రిపోర్టులో తప్పుడు పద్ధతులకు పోలీసులు పాల్పడి, ఈ కేసులో మొత్తం సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ అగ్ర నాయకత్వాన్ని ఇరికించారన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి, ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్ర కార్యదర్శులతో పాటు గత 40-50 సంవత్సరాలుగా బహిరంగంగా ప్రజాసంఘాలల్లో పనిచేస్తున్న నాయకులను ఈ కేసులో ఉద్దేశపూర్వకంగానే కావాలనే ఇరికించారని అన్నారు. మా పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేస్తున్న కామ్రేడ్ సాదినేని వెంకటేశ్వరరావును, పార్టీ రాష్ట్ర నాయకులు, 'రైజింగ్ న్యూడెమోక్రసీ' సహ సంపాదకులుగా పనిచేస్తున్న కామ్రేడ్ కె. గోవర్ధన్, బయ్యారం మాజీ జడ్పీటీసీ, అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న కామ్రేడ్ గౌని ఐలయ్య, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామ్రేడ్ జె.సీతారామయ్య, తదితరులపై రాజద్రోహం, అక్రమ ఆయుధాల చట్టంలోని పలు సెక్షన్ల క్రింద కేసును మోపారన్నారు. పోలీసులు అల్లిన ఈ కట్టుకథలను ప్రజలు, ప్రజాస్వామికవాదులందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. కాంగ్రెస్ ప్రజాస్వామిక పాలన సాగిస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలి తప్పుడు కేసులను బనాయించటం నిర్భంధ, అప్రజాస్వామిక పాలనకు పూనుకోవటం గర్హనీయమని, పూసపల్లి కుట్రకేసును బేషరతుగా ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుడుం వీరభద్రం, పార్టీ నాయకులు మెంగు భగవాన్, గుండెబోయిన లింగమల్లు, ధారావత్ మంగీలాల్, కొదుమూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వంద శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

### మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ అన్నారు. సోమవారం తొర్రూరు పట్టణంలోని పేరుకుపోయిన బకాయి వసూళ్లలో భాగంగా కొన్నింటిని సీజ్ చేశామని, డప్పులతో వినూత నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023 24 సంవత్సరానికి గాను భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్ను దారులకు నోటీసులు ఇచ్చి రెండు మూడు రోజులుగా సంబంధిత పేరుకుపోయిన బకాయిదారులకు మౌఖికంగా చెప్తున్నా కానీ, ఇంతవరకు టాక్స్ కట్టని సముదాయాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ ఆస్తి పన్నుపై అధిక మొత్తంలో పెనాల్టీ పైన 90 శాతం మినహాయింపు ఇస్తున్నందున అందరూ ఉపయోగించుకొవాలన్నారు. పేరుకుపోయిన తమ ఆస్తి పన్నులను 90 శాతం మినహాయింపుతో సకాలంలో చెల్లించి లబ్ధి పొందాలన్నారు. అలాగే పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కట్ట స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డ్ ఆఫీసర్లు దేవేందర్, పట్టాభి, నవీన్, ఉపేంద్ర, బిల్ కలెక్టర్లు శంకర్, యాకయ్య, సిబ్బంది మురళి, చినబాబు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ జిల్లా నేత గాజాల గోవర్ధన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ భీమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, డీఆర్డీఏ మాజీ డైరెక్టర్ గాజాల గోవర్ధన్ వర్ధన్నపేట శాసన సభ్యుడు కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో హైద్రాబాద్ గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. తొలుత జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ చేరికకు సహకరించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్న పేట శాసనసభ్యుడు నాగరాజుకు, నియోజకవర్గం అధికార ప్రతినిధి నిమ్మ శేఖర్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలను గాజాల గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గడ్డం శివరాం, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటయ్య స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయడమే వైవీకి ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన ద్వితీయ వర్ధంతి సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పేరుమాండ్ల జగన్నాథం భవనంలో జరిగిన సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వై. వెంకటయ్య ద్వితీయ వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని సాదుల శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం అధ్యక్షత వహించారు. ఈ సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ వెంకటయ్య తన జీవితకాలమంతా పేదలు, కూలీలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు, ఉద్యమాలు చేసి నిజమైన కమ్యూనిస్టుగా గుర్తింపు పొందాడని తెలిపారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పేదల మధ్యలో ఉండి వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ఎర్రజెండా ఒక్కటే నిజమైన ప్రత్యామ్నాయం అని నమ్మిన నాయకుడు వెంకటయ్య అని ఆయన తెలిపారు. నేడు దేశంలో బీజేపీ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ పేదల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. బీజేపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో 10 సంవత్సరాల పాటు దేశం అధోగతి పాలయ్యిందని ఆయన వెల్లడించారు. కులం, మతం మధ్య చిచ్చు పెట్టి పేదల పోరాటాలను నిర్వీర్యం చేయడం కోసం కుట్రలు చేస్తుందని తెలిపారు. వెంకటయ్య స్ఫూర్తితో రాబోయే కాలంలో పోరాటాలను ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్ణపు సోమయ్య, ఆకుల రాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, కుర్ర మహేష్, కుంట ఉపేందర్, దుడ్డెల రామ్మూర్తి, పట్టణ కమిటీ నాయకులు తోట శ్రీనివాస్, కుమ్మరి కుంట్ల నాగన్న, రావుల రాజు, బానోత్ వెంకన్న, చాగంటి భాగ్యమ్మ, వాంకుడోత్ రమాదేవి, బురుగుల లక్ష్మణ్, మచ్చ వెంకన్న, ఎటిగడ్డతండా శాఖ కార్యదర్శి బానోత్ ప్రకాశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్, ఎంపీటీసీ



**వరంగల్ వాయిస్, రేగొండ :** భూపాలపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో చేరికలు జోరందుకుంటున్నాయి. రేగొండ ఉమ్మడి గోరుకొత్తపల్లి మండలానికి చెందిన కనిపర్తి, నాగుర్లపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీలో సర్పంచ్ కుంట తిరుపతి, ఎంపీటీసీ సుష్మ స్వరాజ్, తండ్రి బల్గూరి కోనరావుతో పాటు మరో 50 మంది బీఆర్ఎస్ నాయకులు చేరగా, వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వంద రోజుల లోపల పూర్తి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేస్తున్న పనులకు ఆకర్షితులమై బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు మాజీ సర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ సుష్మ స్వరాజ్ తండ్రి కోనారావు, కార్యకర్తలు నాయకులు పేర్కొన్నారు. రేగొండ మండలం నాగుర్లపల్లి గ్రామ సర్పంచ్ కుంట తిరుపతి, కానిపర్తి గ్రామ ఎంపీటీసీ సుష్మా స్వరాజ్ తండ్రి బల్గూరి కోనారావుతో పాటు మరో 50 మంది సోమవారం హనుమకొండలోని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వగృహంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో యూత్ కాంగ్రెస్ గ్రామ ప్రెసిడెంట్ ముత్యాల అజయ్ తో పాటు ముఖ్య నాయకులు చేరిక భుజంగరావు, వేల్పుల శ్రీకాంత్, పొన్నాల రాజు, పోశాల కరుణాకర్, ముత్యాల చంటి, ఎలవేన అనిల్, వంగరి రాజు, పుట్ట రాకేష్, కుంట దేవేందర్ తదితరులు ఉన్నారు .ఈ కార్యక్రమంలో రేగొండ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి , ఉమ్మడి మండలాల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య,భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు సూరం వీరేందర్, జిల్లా నాయకులు గుటోజు కిష్టయ్య , మాజీ ఎంపీటీసీ పట్టెం శంకర్, బోయిని వినోద్ కుమార్, పుల్లూరి బాబురావు, గండి తిరుపతి గౌడ్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని గ్రామం వెలికట్టె శివారు జగన తండాలో సోమవారం కుష్టు వ్యాధిపై జరుగుతున్న ఇంటింటి సర్వేను డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ నెల 11న నుంచి జరుగుతున్న కుష్టు వ్యాధి నిర్ధారణకు ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులందరికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, తొర్రూరు డివిజన్ పరిధిలో 77394 కుటుంబాలకు గాను ఇప్పటివరకు 43,944 కుటుంబాలను పరిక్షీంచడం జరిగిందన్నారు. అందులో 317 అనుమానిత కేసులను గుర్తించడం పరీక్షలు నిర్వహించడం కూడా జరిగిందన్నారు. ఇందులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ్ కుమార్, నూతి కృష్ణ, స్థానిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ మండలాధ్యక్షుడిగా బానోతు గణేష్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వైవీ రావు అధ్యక్షతన సోమవారం డోర్నకల్ మండలాధ్యక్షుల ఎన్నిక జరిగింది. మండలానికి చెందిన బానోతు గణేష్ నాయక్ ను భాజాపా నూతన మండలాధ్యక్షుడి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో మండలాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు బీజేపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం అన్ని విధాలుగా కష్టపడి, పార్టీ బాగోగులను చూసుకుంటూ, పార్టీ నమ్ముకుని ఎన్ని ఇబ్బందులు వచ్చిన ఎదుర్కొంటూ పార్టీ సేవలు పంచుకున్నందుకు తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా, మండలం నాయకత్వం ధన్యవాదాలు తెలిపారు.

## పదో తరగతి పరీక్షల సరళి పరిశీలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నేటి నుంచి ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షల సరళిని మహబూబాబాద్ పట్టణం భవానీనగర్, ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్, పోస్ట్ ఆఫీస్ సెంటర్ ప్రభుత్వ గర్ల్స్ హైస్కూలో లో జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈరోజు నుండి జిల్లాలో (49) సెంటర్లలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా (8191) విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు త్రాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు కల్పించి, పరీక్షా కేంద్రాల వద్ద (144) సెక్షన్ విధించడం జరిగిందని అన్నారు.పరీక్షల ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరియైన భద్రత మధ్య ఎస్కార్టుతో తరలించాలని చీఫ్ సూపర్డెంట్, పోలీస్ సిబ్బంది, సంబంధిత సెంటర్ నిర్వాహకులను ఆయన ఆదేశించారు.ఈ పరీక్షా కేంద్రాల తనిఖీలలో ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ప్రిన్సిపల్ ఏ.వెంకటేశ్వరరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## పరపతి సంఘాలతో అభివృద్ధి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేటి రోజులలో తమ తమ కుటుంబ అవసరాలకు రుణాలు పొందాలంటే పరపతి సంఘాలు ఎంతో దోహదపడుతున్నాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సులో భారత్ పరపతి సంఘం అధ్యక్షుడు వలస రాజమల్లు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మరుపల్ల రవి హాజరై మాట్లాడారు. పరపతి సంఘంలో సభ్యులుగా చేరిన వారికి పరపతి సంఘం వారు ఎటువంటి నగలు, డాక్యుమెంట్లు తాకట్టు పెట్టకుండా నమ్మకంతో రుణాలు మంజూరు చేస్తున్నందున పరపతి సంఘం నియమావళి ప్రకారం షేర్స్ రూపాయలతో పాటు అప్పు రూపాయలు సకాలంలో విధిగా చెల్లిస్తేనే పరపతి సంఘాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏ ఆపద వచ్చిన పరపతి సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చని భరోసా కలుగుతుందన్నారు. పరపతి సంఘం అధ్యక్షుడు వలస రాజమల్లు, కోశాధికారి ఎండీ యాకుబ్, ప్రతి సభ్యుడు ప్రతినెల రూ.1000కట్టాలని, వచ్చిన డబ్బులను అప్పు కోరిన వారికి మంజూరు చేస్తూ డబ్బులకు రూ. 50 పైసల మిత్తితో వసూలు చేస్తామన్నారు. సకాలంలో చెల్లించని వారి వద్ద నుంచి జరిమాన వసూలు చేస్తామని తెలియపరిచారు. భారత్ పరపతి సంఘం ఉర్సు వరంగల్‌కు నూతన కమిటీని ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షుడిగా మరుపల్ల రవి, అధ్యక్షుడిగా వలస రాజమల్లు, ఉపాధ్యక్షుడు ఎండీ ఫక్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎండీ ఫిరతో జుపాషా, సహాయ కార్యదర్శి ఓడపల్లి అజయ్ బాబు, కోశాధికారి ఎండీ యాకూబ్, ఆర్గనైజర్ కందగట్ల రవి, కార్యవర్గ సభ్యులు దిద్దిరాజు, ఎండీ జమీల్, ఎండీ మక్బూల్‌హఫీజ్, తుమ్మ రాజ్‌కుమార్, బూర ప్రమోద్ ఉన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బెజ్జంకి పూర్ణ చారి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పరకాల పట్టణానికి చెందిన బీజేపీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారిని నియమించినట్లు హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణాచారి మాట్లాడుతూ బీజేపీ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, బీజేపీలో పని చేసినందుకు ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఇస్తుందని గుర్తు చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికకు సహకరించిన బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ , నాంపల్లి శ్రీనివాస్ బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీలో ఓబీసీ మోర్చా అనేది కీలక భాగమని సుమారు 53 శాతం ఉండే బీసీలకు నరేంద్ర మోడీ ఎన్నో అవకాశాలు కల్పించి బీసీ ముఖ్యమంత్రిని కూడా చేస్తాననడం చాలా శుభసూచకమన్నారు. తనపై నమ్మకం ఉంచి ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు తన వంతు కర్తవ్యంగా బీజేపీని అగ్ర పదంలో నిలిపెందుకు శాయశక్తులా కృషి చేస్తానని పూర్ణ చారి తెలిపారు.

## పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు



**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైన నేపథ్యంలో ములుగు జిల్లా ఎస్పీ డా. శబరిష్ ఆదేశాలతో ములుగు పట్టణం, మల్లంపల్లి, జాకారం, వెంకటాపూర్, బండారుపల్లిలో గల పరీక్ష కేంద్రాలను ములుగు డీఎస్పీ పి. రవీందర్ పరిశీలించి అధికారులకు సిబ్బందికి తగు జాగ్రత్తలు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత పరీక్షల పర్యవేక్షణ అధికారికి, పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు నిర్దిష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉన్నటువంటి అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేశారు. ఎటువంటి వారైనా ఏ హోదాలో గల వారైనా వారి వద్ద ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవని, దీన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సిబ్బందికి తెలియజేశారు.

## జంగాకు శుభాకాంక్షలు తెలిపిన కోడిపాక గణేష్ కుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చెర్మన్‌గా నియమితులైన జంగా రాఘవ రెడ్డిని సోమవారం హనుమకొండలోని ఆయన ఫామ్ హౌస్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోడిపాక గణేష్ కుమార్ కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పోలీసుల ముమ్మర తనిఖీలు



**వరంగల్ వాయిస్, ములుగు :** పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన సందర్భంగా ఎన్నికల నియమావళిని అనుసరించి రానున్న ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా జిల్లా ఎస్పీ డా.శబరీష్ జిల్లాలో గల పలు రహదారుల వద్ద చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ములుగు డీఎస్పీ జిల్లా ఎస్పీ ఆదేశాలతో సోమవారం పలు చెక్ పోస్ట్ లను ఆకస్మిక తనిఖీ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు.

# దళితులకు అన్యాయం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

## ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్



**వరంగల్ వాయిస్, కేయూ :** ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులలో తీవ్ర అన్యాయం చేయడం చాలా బాధాకరమని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. సోమవారం కేయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సర్కార్ 37 మందికి నామినేట్ పదవులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని మంద నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన సామాజిక వర్గానికి మాత్రమే నామినేటెడ్ పదవుల్లో పెద్ద పీట వేశారని మండిపడ్డారు. సామాజిక న్యాయం చేస్తామని అధికారమెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అయినా గుర్తించి సముచిత స్థానం కల్పించాలన్నారు. ఏ పార్టీ అయినా సరే కాకతీయ యూనివర్సిటీ ఉద్యమకారులకై వరంగల్ ఎస్సీ పార్లమెంట్ టికెట్ కేటాయించాలనీ మంద నరేష్ కోరారు. ఈ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్ కళ్యాణ్, పృథ్వి, రాజ్, వివేక్, సునీల్, వెంకటేష్, సాయి కిరణ్, శ్రీకాంత్, శేఖర్, సురేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

## యువ మోర్చా నాయకుడు బత్తుల సుమంత్



**వరంగల్ వాయిస్, పరకాల :** భారతదేశ ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, అఖండ మెజార్టీతో పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందని యువ మోర్చా నాయకులు బత్తుల సుమంత్ తెలిపారు. పరకాలలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయదుందుబి మోగిస్తారని చెప్పారు. కేంద్రం నుంచి వరదలాగా నిధులు తెచ్చి రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పునాది లేకుండా పోతుందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు పాలకులు చేసిన దోపిడి, భూ కబ్జాలు, దౌర్జన్యాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నిరుపేద మహిళలకు ఉచిత గ్యాస్, ఆరోగ్య బీమాతో పాటు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వందన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను కలిసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హైదరాబాదు :** నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నాగరిగారి ప్రీతంను వారి నివాసంలో వరంగల్ ఎంపీ ఆస్పిరంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎస్సీ కార్పొరేషన్ నాగరి మాట్లాడుతూ ఎస్సీల్లో ఉండబడే ప్రతి ఒక్క కుటుంబాన్ని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆదుకొని వారి ఆర్థిక అభివృద్ధి చెందడం కోసం తోడ్పడుతానని ఇచ్చిన మాట కాంగ్రెస్ తప్పదని, మాట ఇచ్చిందంటే నిలబెట్టుకుంటుంది తప్ప, మాట తప్పదనే విధంగా ఎస్సీ కార్పొరేషన్ కు అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ను కలిసిన వారిలో ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్, అంబాల స్వామి, చల్లా మల్లికార్జున్, ఆరూరి సాంబన్న, నందిపాక భాస్కర్, తలకోట్ల రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

# ఫెయిర్ అండ్ ఫ్రీగా పార్లమెంట్ ఎలక్షన్ నిర్వహించాలి


## జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** పార్లమెంట్ ఎలక్షన్ ఫెయిర్ అండ్ ఫ్రీ ఎలక్షన్ గా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి, రిటర్నింగ్ అధికారిని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్రా మిశ్రాతో కలసి ఎస్ ఎస్ టీ, ఎఫ్ఎస్ టీ, వీఎస్ టీ, సెక్టార్ అధికారులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై మొదటి దశ శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. ములుగు నియోజకవర్గంలో పార్లమెంట్ ఎలక్షన్ కోసం 36 సెక్టార్లను ఏర్పాటు చేశామని, ప్రతి సెక్టార్ కు, ఒక సెక్టార్ అధికారిని నియమించామని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన విధివిధానాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, వాటిని తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎలక్షన్ కోసం నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల చేస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 20 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని, నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 26న జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29 వరకు అవకాశం ఉంటుందని మే 13న పోలింగ్ జరుగుతుందని, కౌంటింగ్ జూన్ 4న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరిగితే ఎన్నికల సంఘం నియమ నిబంధన ప్రకారం చర్యలు తప్పవని, కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా కుల, మత ,వర్ణ, వర్గం, ప్రాంతాలపై విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం అని ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం తప్పుడు ప్రచారం చేయడం ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం నేరమన్నారు. అలాంటి ప్రచారాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడం కోసం జిల్లాలో ఎంసీసీ సర్వే లైన్స్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ప్రజలు స్వయంగా 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు గానీ, సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సి విజిల్ యాప్ లో ఫిర్యాదు చేసిన 100 నిమిషాల గడువు లోపు అధికారులు క్షేత్రస్థాయికి చేరుకొని వచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలకు రాజకీయ నాయకులకు సంబంధించిన వాల్ రైటింగ్ ఫ్లెక్సీలు ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో రైల్వే స్టేషన్ బస్టాండ్ పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్రాంతాలలో 48 గంటల వ్యవధిలోను అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో తొలగించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారిని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పోలింగ్ సెంటర్లలో దివ్యాంగుల ఓటర్లకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రజలు నేరుగా సి విజిల్ మొబైల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిశీలించి అప్డేట్ చేయాలన్నారు. సెక్టర్, నోడల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని సమస్యలు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి , సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

# డీఎఫ్ఓపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

## కాంగ్రెస్ నేత భూక్య శ్రీను నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గిరిజన వారసత్వ భూములను కబ్జాకు పాల్పడుతున్న ఫారెస్ట్ అధికారి కర్ణావత్ వెంకన్న బాగోతం గురించి ఎస్పీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ వార్డ్ కౌన్సిలర్ భూక్య శ్రీను నాయక్ పై సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ మండలం శనిగపురం రెవెన్యూ శివారులో గల సర్వే నెంబర్ 274లో బీసీ కాలనీలో తన తాతలకు 16 ఎకరాల భూమి 1974 వ సంవత్సరం నుంచి 38/ఇ, టెనేన్స్ యాక్ట్ ద్వారా సంక్రమించిందని తెలిపారు. మా తాతల వారసత్వ భూములను ఫారెస్ట్ అధికారి కర్ణావత్ ఎంకన్న (డి ఎఫ్ ఓ) తన అంగ బలంతో, అధికారుల అండదండలతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, అధికారులను ప్రలోభ పెట్టి, తన అధికార బలాన్ని ఉపయోగించి తన భార్య అయిన కర్ణావత్ రాధాబాయి పేరు మీద ఎ,,1: 20 గుంటల భూమిని పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ఆ భూమిలో దాదాపు 20 గుంటల భూమిలో తన ఇంటి నిర్మాణాన్ని నిర్మించుకుని, మిగతా భూమిని తెల్ల పేపర్లు పై గీతలు గీసుకొని ప్లాట్లుగా చేసి అమ్ముకున్నాడన్నారు. ఆ తరువాత అదే ఎ,1: 20 గుంటల భూమి పట్టా అందరికీ చూపించుకుంటూ దాదాపుగా మరో 2 ఎకరాల మా వారసత్వ భూమిని ప్లాట్లుగా చేసుకుని అమ్ముకుంటూ వచ్చే డబ్బులతో గతంలో రెవెన్యూ అధికారులను, అటు పోలీసు అధికారులను ప్రలోభాలకు గురి చేస్తూ ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తన అధికార బలంతో మా భూములను అక్రమంగా అన్యాయంగా కబ్జా చేసుకుంటూ అమ్ముకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కర్ణావత్ రాధాబాయికి ఏ విధంగా సర్వేనెంబర్ 274లో ఎ,1: 20 గుంటల భూమి సంక్రమించిందని సమాచార హక్కు చట్టం ద్వారా వివరణ కోరగా రెవిన్యూ వారు కర్ణావత్ రాధాబాయికి సంబంధించిన ఏ విధమైన ఆధారాలు కానీ, లింకు డాక్యుమెంట్లు కానీ లేవని లిఖితపూర్వకంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రెవిన్యూ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ భూ కబ్జాలకు పాల్పడుతున్న ఫారెస్ట్ అధికారి కర్ణావత్ వెంకన్నపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకొని, అతనిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

# సిబ్బంది అలసత్వం వహించొద్దు

## డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి భాయ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆరోగ్య కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది అలసత్వం వహించరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి కళావతి భాయ్ అన్నారు. జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి కళావతి భాయ్ సోమవారం ఐడీఓసీలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్స్ తో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాల్లో జరగాలని, సాధారణ ప్రసవాలు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరగాలని, సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించాలన్నారు. వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని, అసంక్రమిత వ్యాధులైన బిపి షుగర్, క్యాన్సర్ వ్యాధులు నిర్ధారణ 30 సంవత్సరాలు పైబడిన వారందరినీ పరీక్షించాలని, కుష్టు నిర్మూలన కార్యక్రమంలో చేపడుతున్న కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. రెండు వారాలకు పైన దగ్గుతో బాధపడుతున్న వ్యక్తులకు తెమడ పరీక్షలు చేయాలని , టెలి మెడిసిన్ సేవలను వినియోగించుకోవాలని, రానున్న వేసవి కాలంలో ఓ ఆర్ ఎస్ కార్నర్లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేసి, మహబూబాబాద్ జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని సూచించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్స్ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేస్తూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ముందు వరుసలో ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ వోలు డాక్టర్ అంబరీష, డాక్టర్ మురళీధర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ నాగేశ్వరరావు డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, డిప్యూటీ డెమో ప్రసాద్, మంగమ్మ పాల్గొన్నారు.

# ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి పూజారి సాంబయ్య

## 'నా ఆలోచనానందనాలు-అభిరుచులు' పుస్తకావిష్కరణ

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** శ్రీ సరస్వతీ శిశు మందిర్ పూర్వ ప్రధానాచార్యులు పూజారి సాంబయ్య రాసిన పుస్తకం" నా ఆలోచనానందాలు అభిరుచులు పుస్తకాన్ని జమ్మికుంట శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పూర్వాచార్యులు, హైతైషులు, పోషకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ముక్క రాజేశ్వరయ్య, చందా విశ్వనాథం దంపతులు, శ్రీ పొలసాని సుధాకర్ రావు, జమ్మికుంట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ శ్రీ శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్ పాల్గొని 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పూజారి సాంబయ్య సమాజంలో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి అని కొనియాడారు. జమ్మికుంటలో వేలాది మంది విద్యార్థిని విద్యార్థులకు చక్కని విద్యతో పాటు సంస్కారాన్నిఅందించారని అన్నారు. ఎందరినో స్వయం సేవకులుగా తీర్చిదిద్దారని అతిథులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటి మహనీయుడిని మా గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని డాక్టర్ రాజేశ్వరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వాచార్యులు మంతెన శ్రీమన్నారాయణ, బుట్టి శివయ్య, వీసీ కిరణ్, సీఏ చంద్రయ్య, పూజారి రాజయ్య, పూజారి సుదర్శనమ్, గుడి కందుల సుదర్శన్, దాసరి రవీందర్ ఆచలం శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు శీల జయప్రకాశ్, బచ్చు సురేశ్, చందాశివ కుమార్, అశ్వ రాజేందర్, రామిని మనోహర్, రాం రమేశ్, గట్టిపెల్లి రామేశ్, చందా జయశంకర్, చండా రమాదేవి, శైలజ, బీజేపీ రమాదేవి, గుండా తిరుపతయ్య, వీరగోని రాజయ్య పాల్గొన్నారు.





# భవన నిర్మాణ కార్మిక చట్టాలను రక్షించుకోవాలి

**వరంగల్ వాయిస్, మరిపెడ :** భవన నిర్మాణ కార్మికుల సమగ్ర చట్టాలను రక్షించుకోవడానికి భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా పోరాడాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు అన్నారు. సోమవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని స్థానిక కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వంగూరి రాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో భవన నిర్మాణ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్ర శాసన చట్టం తీసుకొచ్చిందని, దానిని అమలు చేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. అంతేగాక నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్ లను రద్దు చేయాలని చూస్తుందని, ఇది ప్రజాస్వామ్య వ్యతిరేకమైన చర్య అన్నారు. దీన్ని కార్మిక వర్గం తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. భవన నిర్మాణ రంగంలో రోజురోజుకు పని దినాలు తగ్గుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుక, ఇసుక, సిమెంటు, పెయింట్ తదితర ముడి సరుకుల ధరలు నియంత్రించకుండా ప్రభుత్వాలు విపరీతంగా పెంచేసాయన్నారు. నిర్మాణ రంగంలో యాంత్రికరణ పద్ధతులు రావడంతో కార్మికులకు పని దినాలు తగ్గిపోయి ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో జరిగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్మికులు సంఘటితంగా పోరాటాల్లోకి రావాలని, కార్మిక హక్కుల కోసం సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు నందిపాటి వెంకన్న, భవన్ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య, నాయకులు బండ వీరస్వామి, భూషిషాక ముత్తయ్య, పసుపులేటి యాదగిరి, ఎల్లయ్య, భిక్షం, ఎడెల్లి శ్రీనివాస్, పోలేపాక వెంకన్న, వెంకన్న, జినక సైదులు, కామిడ్ల వెంకన్న, బెల్లం పాపయ్య, బిక్కు, రాములు, కొండ వెంకన్న, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.



# సమ్మె నోటిస్‌పై యూనియన్ ప్రతినిధులతో చర్చలు

## 20 వరకు జీతాలు చెల్లిస్తామని ఎన్ హెచ్ఎం డైరెక్టర్ కర్ణన్ హామీ

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న దాదాపు 17వేల మంది ఉద్యోగులకు మూడు నెలలగా చెల్లించకుండా ఉన్న పెండింగ్ జీతాన్నివెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెను చేస్తామని ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీస్ పై నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్, తెలంగాణ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ తో జరిగిన చర్చలు ఆశాజనకంగా జరిగాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ తెలియజేశారు . సమ్మె నోటీసుపై కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ పెండింగ్ లో ఉన్న వేతనాలను ఈనెల 20 వరకు చెల్లించనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు. 20 వరకు జీతాలు చెల్లిస్తే సంతోషమని, లేనిపక్షంలో 22 నుంచి సమ్మె యధావిధంగా కొనసాగిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. నేషనల్ హెల్త్ మిషన్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.380 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్ తో సంబంధం లేకుండా ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించాలని ఆయన కమిషనర్ కోరారు. మార్చి 7న రాష్ట్రవ్యాప్తంగా డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, నేటికి కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల్ని విడుదల చేయకుండా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వమైనా దీనిని సరిచేసి కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ జీతాలు చెల్లించే విషయంలో కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని, జీతాలపై జరిగే పోరాటానికి ఎన్నికల కోడ్ కు ఎలాంటి సంబంధం లేదని వారు ఈ సందర్భంగా కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు రెండవ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, రెండవ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ, ప్రధాన కార్యదర్శి బి శ్యామల, కోశాధికారి జే పద్మ, రాష్ట్ర కార్యదర్శులు జ్యోతి, పీ.పద్మ, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి, డిప్యూటీ కార్యదర్శి దేవనబోయిన బాపు యాదవ్, రాష్ట్ర ఎన్ హెచ్ఎం వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, ఆయూష్ ప్రెసిడెంట్ సంగారెడ్డి జిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** వేసవిలో గ్రామీణ ప్రజలకు త్రాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలని ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ మంచినీటి సరఫరాపై క్షేత్రస్థాయిలో ఏటూరు నాగారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 3 నెలలపాటు ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ప్రత్యేకించి తాగునీటిని వృధా చేయవద్దని, ఇల్లు శుభ్రం చేసుకునేందుకు, ఇతర పనులకు తాగునీటిని వాడవద్దని, వీటికి ముడి నీటిని వాడాలని కోరారు. లీకేజీలు ఉన్న చోట వెంటనే అరికట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటితో పాటు, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని అందరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. అవసరం ఉన్న చోట హ్యాండ్ పంపులు, బోర్ వెల్సు ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డిప్యూటీ సీఈఓ రమాదేవి, డి.ఈ నాగేశ్వర్ రావు, తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శాలివాహన సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన శాలివాహన సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కల్వచర్ల భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కుమ్మరి సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కుమ్మరి శాలివాహన సామాజిక వర్గానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతి జిల్లాలో ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. రూ.1000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కుమ్మరి సామాజిక వర్గం మూడు శాతం ఉన్నారని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుమ్మరి సామాజిక వర్గం తయారు చేసే పింగాణి మట్టి పాత్రలకు మార్కెటింగ్ సౌకర్యం, సబ్సిడీ రూపంలో ప్రభుత్వం రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# పురుగుల మందు తాగి యువకుడి మృతి

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని రాజు పల్లి గ్రామానికి చెందిన ఆవుల దిలీప్ (17) అనే వ్యక్తి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతను ఆన్ లైన్ లో టెలిగ్రామ్ యాప్‌కు సంబంధించిన ఫేక్ ట్రెండింగ్‌లో రూ.1,60,000 పెట్టుబడి పెట్టగా మోసపోయి మొత్తం డబ్బు పోగొట్టుకున్నాడు. ఈ విషయం తన తండ్రికి చెబితే ఏమైనా అంటాడేమో అని భయంతో మార్చి 3న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వారి వ్యవసాయ పొలం వద్దకి వెళ్లి పురుగుల మందు తాగగా తల్లిదండ్రులు చూసి హాస్పిటల్‌కితరలించారు. ఆ రోజు నుంచి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఆవుల శ్రీనివాస్ఫిర్యాదు మేరకు శాయంపేట ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 53వ డివిజన్ లష్కర్ సింగారంలో డివిజన్‌కు చెందిన సుమారు 100 మంది జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్ర మహేందర్ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్క్ ఖండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రేణుకుంట్ల ప్రవీణ్, పుల్ల చిన్న, ఎర్ర శరత్, రేణుకుంట్ల కిరణ్, నద్దునూరుని రవి, శిలువేరు నరేష్, శిలువేరు బాబు,. ఎర్ర టోనీ అల్వాని రమేష్, తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాబా భాయ్, మాజీ డిప్యూటీ మేయర్ టి. అశోక్ రావు, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ మీర్జా అజీజ్ ఉల్లా బేగం, కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎర్ర కావ్య మహేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.పీ. ఆనంద్, ఎర్ర మహేందర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, బొక్కల సదానందం, చిల్పూరి శ్యామ్, ఆరూరి రాజు, ఇమ్రాన్ పాల్గొన్నారు.



# పుట్టినరోజుకైనా అప్‌డేట్ వచ్చేనా..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ పుష్ప2. క్రియేటీవ్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. పుష్ప పార్ట్ 1 బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన కారణంగా.. పార్ట్ 2పై రోజురోజుకి హైప్ నెక్ట్స్ లెవల్ కు చేరుకుంటోంది.అందుకు తగ్గట్టుగానే మేకర్స్ కూడా ఎక్కడ రాజీపడకుండా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా గురించి వినిపిస్తున్న చిన్న న్యూస్ అయినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా అలాంటి న్యూస్ ఒకటి అల్లు అర్జున్ ఫ్యాన్స్ ను ఖుషీ చేస్తోంది. చాలా కాలంగా పుష్ప 2 అప్డేట్స్ కోసం అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. కానీ, ఎలాంటి అప్డేట్స్ రాకపోవడంతో చాలా డిజప్పాయింట్ అవుతున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం అల్లు అర్జున్ ఫ్యాన్స్ కోసం ఓ స్పెషల్ ట్రీట్ అరేంజ్ చేశారట పుష్ప2 మేకర్స్. అవును.. ఏప్రిల్ 8 అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా ఓ సాలిడ్ అప్డేట్ ఇవ్వాలని ప్లాన్ చేశారట. అయితే అది ఎలాంటి అప్డేట్ అనేది మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. సినిమా రిలీజ్ కు మరో నాలుగు నెలల టైం ఉంది కాబట్టి.. ఒక చిన్న టీజర్ లాంటిది రిలీజ్ చేసి సినిమాపై హైపు క్రియేట్ చేయాలని ఎ÷-లాన్ చేస్తున్నారని టాక్. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇక పుష్ప పార్ట్ 2 విషయానికి వస్తే.. ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. మరి భారీ అంచనాల మధ్య ఆగస్టు 15న విడుదల కానున్న ఈ సినిమా ఎలాంటి వండర్స్ క్రియేట్ చేయనుందో చూడాలి.



## వివాహబంధంలోకి మీతా రఘునాథ్

చిత్రపరిశ్రమలో ఈ ఏడాది పెళ్లి బాజాలు కాస్త ఎక్కువగానే వినిపిస్తున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్, నటాషా దోషి, కృతికర్భందా వంటి కథానాయికలు ఇటీవల వైవాహిక బంధంలోకి అడుగుపెట్టగా.. తాజాగా ఆ జాబితాలోకి మరో యువ నటి చేరింది. 'గుడ్‌నైట్' తో విజయాన్ని అందుకున్న కోలీవుడ్ భామ మీతా రఘునాథ్. రొమాంటిక్ కామెడీగా రూపొందించిన ఈ చిత్రంలో ఆమె నటనకు సినీ ప్రియులు మనసు పారేసుకున్నారు. ఆమె వివాహబంధంలోకి అడుగుపెట్టారు. జీవిత భాగస్వామితో కలిసి దిగిన ఫొటోలను తాజాగా ఇన్‌స్టాలో షేర్ చేశారు. 'నా హృదయం' అని రాసుకొచ్చారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. తన భర్త పేరేంటి? వివాహం ఎప్పుడు జరిగింది అనే విషయాలను మాత్రం వెల్లడించలేదు. మీతా సొంతూరు ఊటీలో కుటుంబసభ్యులు, సన్నిహితుల సమక్షంలో వివాహం జరిగినట్లు సమాచారం. మరోవైపు, 'గుడ్‌నైట్' చిత్రానికి గాను ఉత్తమ నటిగా ఆమె జె.ఎఫ్.డబ్ల్యూ మూవీ అవార్డును సొంతం చేసుకున్నారు.







## సర్దుకున్న వివాదం

తమ అనుమతి లేకుండా గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటను రీక్రియేట్ చేయడంపై ఆయన తనయుడు ఎస్పీ చరణ్.. 'కీడా కోలా' దర్శకుడు తరుణ్ భాస్కర్, మూవీ టీమ్‌పై న్యాయపరమైన చర్యలకు దిగినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఓ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న తరుణ్ భాస్కర్ ఈ వివాదానికి వివరణ ఇచ్చారు.. 'కీడాకోలా'లో ఏఐ టెక్నాలజీ ద్వారా ఎస్పీ బాలు వాయిస్ వాడటంపై ఆయన కుమారుడు చరణ్ మీకు లీగల్ నోటీసులు పంపించారని వార్తలు వచ్చాయి. నిజమేనా?' అని విలేకరి ప్రశ్నించాడు. ఇద్దరి వైపు నుంచి కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది. మనకున్న గొప్ప కళాకారులను గౌరవిస్తూ ప్రేక్షకులను అలరించే విధంగా ఏదైనా వినూత్నంగా చేయాలని ప్రతి ఒక్కరూ తాపత్రయ పడుతుంటారు. అమర్యాద పరచాలనే ఉద్దేశం ఎవరికీ ఉండదు. అగ్ర నటీనటులతో వాణిజ్య చిత్రాలు చేయాలని నేనెప్పుడూ అనుకోలేదు. అలాంటి మనస్తత్వం లేదు. ఏదైనా కొత్తగా చేయాలనుకున్నాం. కృత్రిమ మేధకూ కొన్ని పరిమితులున్నాయి. ఇప్పుడున్న రోజుల్లో చాలా ఉద్యోగాలు రిస్క్‌లో పడ్డాయి. రేపు ఏం జరుగుతుందో తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వాటిని గౌరవిస్తూ కొత్తగా ఏదైనా క్రియేట్ చేయాలి. ఈ క్రమంలోనే కమ్యూనికేషన్ గ్యాప్ తలెత్తి ఉండొచ్చు. కానీ.. ఇప్పుడంతా సర్దుకుంది. సమస్యను పరిష్కరించాం అని తరుణ్ భాస్కర్ బదులిచ్చారు.



## రామ్‌చరణ్ మూవీలో బిగ్‌బి

ఆర్‌ఆర్‌ఆర్ లాంటి గ్లోబల్ సక్సెస్ తరువాత వరుసగా అన్నీ క్రేజీ ప్రాజెక్టులను ఒకే చేస్తున్నాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ప్రస్తుతం ఆయన తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్‌తో గేమ్ ఛేంజర్ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పొలిటికల్ బ్యాక్డ్రాప్ లో కమర్షియల్ ఎంటర్‌టైనర్ గా వస్తున్న ఈ సినిమా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇక ఈ సినిమా తరువాత చరణ్ ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబుతో ఓ సినిమా చేస్తున్నాడు. రూరల్ స్పోర్ట్స్ బ్యాక్డ్రాప్ లో వస్తున్న ఈ సినిమాలో శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయం ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో ప్రకటించారు. తాజాగా ఈ సినిమాలో మరో పాన్ ఇండియా స్టార్ కూడా యాడ్ కాబోతున్నాడట. ఆ స్టార్ మరెవరో కాదు బిగ్ బి అమితాబ్ బచ్చన్. అవును.. ఈ సినిమాలో మరో కీ రోల్ కోసం బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ ను తీసుకోనున్నారట. ఇప్పటికే ఈ పాత్రకు సంబంధించి ఆయనతో చర్చలు కూడా ముగిశాయని, పాత్ర నచ్చడంతో అమితాబ్ కూడా వెంటనే ఒకే చెప్పేశాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ న్యూస్ ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అమితాబ్ రాకతో ఖీఅ16 అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఆస్కార్ విజేత ఏఆర్ రహమాన్ సంగీతం అందించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చ్ 22 నుండి మొదలుకానుంది అని సమాచారం. మరి భారీ స్టార్ కాస్ట్ తో వస్తున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకోనుందో చూడాలి.

# బ్రహ్మోత్సవాలకు వేళాయే..

**భక్తుల కొంగు బంగారం కోటంచ నృసింహుడు**

**ముస్తాబైన ఆలయం**

**19 నుంచి 27 వరకు ఉత్సవాలు**

**20న స్వామి వారి కళ్యాణోత్సవం**

**ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ఎమ్మెల్యే, కలెక్టర్**

**వరంగల్ వాయిస్, రేగొండ :** కోరిన కోర్కెలు తీర్చి..భక్తుల కొంగు బంగారంగా నిలుస్తున్నాడు కోటంచ నృసింహుడు. ఉమ్మడి రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామిని సత్య నిష్టతో నమ్మి కొలిచిన భక్తుల కష్టాలు తీరుస్తాడని విశ్వాసం. ఏటా ఫాల్గుణ శుద్ధ దశమి రోజున బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. మార్చి 19న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు వారం రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. వందల ఏండ్ల చరిత్ర కలిగిన కొడవటంచ క్షేత్రం భక్త జనం పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతోంది. మానసిక రుగ్మతలను పారద్రోలుతూ కోరి మొక్కిన వారి కష్టాలు తీరుతుండడంతో రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. నిత్యం పూజలందుకుంటున్న స్వామి వారికి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 20న అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

## కొటంచ చరిత్ర..

కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి చరిత్రను ఇక్కడి ప్రజలు ఆసక్తికరంగా చెప్పుకుంటారు. స్వామి వారి మహత్యం మహా గొప్పదని ప్రచారం జరుగుతోంది. వందల ఏళ్లకు పూర్వం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల వంశమైన తూర్పు రాణి రంగాచార్యులు ఈ ఆలయాన్ని వెలుగులోకి తెచ్చారు. రంగాచార్యులు ఒకనాడు ఆలయ ప్రాంతంలోని చేదబావిలో నీరు తోడుతుండగా లక్ష్మీ నరసింహ స్వామి ప్రతిమ లభించింది. తర్వాత ఆచార్యులకు కలలో కనిపించిన స్వామి బావి సమీపంలో శిలావిగ్రహం రూపంలో ఉన్నట్లు చెప్పి మాయమైనట్లు చెబుతుంటారు. అయితే ఎంత వెతికినా స్వామివారి ప్రతిమ కనిపించలేదు. తర్వాత రంగాచార్యులకు మళ్లీ కలలో సాక్షాత్కరమైన స్వామి తన విగ్రహం గల ప్రదేశానికి ఆనవాలుగా ఇటుక ఆకారంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి విగ్రహంలో తాను నిక్షిప్తమై ఉన్నట్లు చెప్పి మళ్లీ మాయమైనట్లు భక్తులు పేర్కొంటున్నారు. దీంతో రంగాచార్యులు కొడవలి సహాయంతో పుట్ట తొలుస్తుండగా స్వామి వారి విగ్రహం తాకి కొడవలి వంగి పోయిందని, కొడవలిని వంచిన స్వామి పేర క్షేత్రం కోటంచగా స్థిరపడిపోయింది. ప్రస్తుతం కొడవటంచగా పిలవబడుతోంది. స్వామి వారు ఉన్న ప్రదేశంలోనే ఆలయ నిర్మాణం జరిగిందని చెప్పుకుంటారు.

## మహిమాన్వితం..

కొడవటంచ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సన్నిధి మహిమాన్వితమైనది. మానసిక వ్యాధులతో బాధ పడే వారు స్వామి వారిని దర్శించుకుంటే వ్యాధులు మటుమాయమవుతాయనేది నమ్మకం. మానసిక వ్యాధితో బాధపడేవారు ఆలయ ప్రాంగణంలో ఉంటూ స్వామివారిని కొలుస్తుంటారు. అంతేకాకుండా నిత్యం భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ కోరికలు నెరవేరాలని మొక్కులు చెల్లించుకుంటారు. కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు జాతర సమయంలో మేక, గుర్రం ప్రభ బండ్ల వాహనాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. సంతానం లేని భక్తులు సంతానం కోసం తడిబట్టలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు.

## నిత్య పూజలు..

నిత్యం పూజలతో క్షేత్రం భక్తి పారవశ్యంతో పొంగిపోతుంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం వెలిసిన కొడవటంచలో ఒకప్పుడు జాతర సమయంలోనే భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీరుతుండడంతో జాతర సమయంలోనే కాకుండా నిత్యం స్వామివారికి పూజలు చేసేందుకు భక్తులు ఆలయానికి వస్తున్నారు. కొత్త వాహనాల పూజలు చేసేందుకు కూడా లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేసుకుంటారు. ప్రతిరోజు ఉదయం ఐదు గంటల నుంచి స్వామి వారి సేవా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ఎక్కడాలేని విధంగా త్రికాల ఆరగింపు కేవలం కొడవటంచ ఆలయంలోనే నిర్వహించడం ప్రత్యేకత. ప్రతీ నెల స్వామి వారికి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. నివేదన సమయంలో ఆలయ సన్నిధిలో సమానత్వానికి సూచికగా భక్తులను కూర్చోబెట్టి స్వామివారి ప్రసాదాన్ని అందిస్తారు.



## 19 నుంచి బ్రహ్మోత్సవాలు..

ఈ నెల 19వ తేదీ మంగళవారం రోజున ఉదయం అభిషేకం, సూర్యవాహన సేవను నిర్వహించనున్నారు. 20వ తేదీ బుధవారం రాత్రి స్వామి వారి కళ్యాణ మహోత్సవం, తలంబ్రాలు జరుగనున్నాయి. 23వ తేదీ గురువారం రాత్రి గరుడోత్సవం, 25వ తేదీ సోమవారం బోనాలు, బండ్లు తిరిగే కార్యక్రమాలు జరుగనున్నాయి. 26వ తేదీ మంగళవారం నిత్యనిధి జాతర, మొక్కుబడి సేవలు, 27వ తేదీ బుధవారం చక్రస్నానం, అభిషేక కార్యక్ర మాలు జరుగనున్నాయి. స్వామివారి కళ్యోనోత్సవానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసన సభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు పద్మ దంపతులతోపాటు భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా హాజరు కానున్నారు.





### ఏర్పాట్లు పూర్తి..:
**– ఈఓ, బిల్లా శ్రీనివాస్**

కోటంచ బ్రహ్మోత్సవాలకు వేలాదిగా తరలి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ కార్య నిర్వహణ అధికారి బిల్లా శ్రీనివాస్ తెలిపారు. బ్రహ్మోత్సవాల అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులకు కావాల్సిన వసతులు కల్పిస్తున్నామన్నారు. తాగునీటి సరాఫరా, ఆర్టీసీ బస్సు సౌకర్యం, విద్యు త్, వైద్యం, ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

### చలువ పందిళ్లు వేశాం..:
**-ముల్కనూరి భిక్షపతి, ఫెస్టివల్ కమిటీ చైర్మన్**



మంగళవారం నుంచి అత్యంత వైభంగా నిర్వహించనున్న నృసింహ స్వామి బ్రహ్మోత్సవలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు జాతరకు వచ్చే భక్తులకు వేసవి ఎండనుంచి రక్షణ కల్పించేలా చలవ పందిళ్ళు ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి వసతి, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

## అధికారులు బాధ్యతతో పని చేయాలి: రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో,బాధ్యతతో పని చేయాలని వరంగల్-15 ఎస్సీ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిటీ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, షేక్ రిజ్వాన్ బాషా, భవేష్ మిశ్రా, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ కుమార్, డీసీపీలతో కలసి వరంగల్-15 ఎస్సీ పార్లమెంట్ పరిధిలోని స్టేషన్ ఘన్ పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట్, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల ఏఆర్ ఓలు, ఉప ఎన్నికల జిల్లా అధికారులు, జిల్లాల ఎన్నికల నోడల్ అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజవర్గం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో నవీకరించిన బీఎల్ ఓ వివరాలు, ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాల వివరాలు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా నిర్వహణ ప్రణాళిక, క్లిష్టమైన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలైన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంట్ టీమ్స్, సెక్టార్ ఆఫీసర్ల నియామకం, ఎంసీఎంసీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, రిసెప్షన్ డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ల సిబ్బందికి శిక్షణ, నాలుగు జిల్లాల ధరల పట్టికలో రేట్లు ఒకే రకంగా ఉండాలని, నోడల్ అధికారుల నియామకం, పోస్టల్ బ్యాలెట్ ల నిర్వహణ, ఓటింగ్ శాతం పెంచుటకు కార్యక్రమాలలో భాగంగా క్యాంపస్ అంబాసిడర్లు, స్పెషల్ పోలింగ్ కేంద్రాలు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్బు, ఓటర్స్ అవేర్నెస్ ఫోరంల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతుల కల్పన, ఎన్నికల విధులు నిర్వహణ, సామగ్రి పంపిణీ కు వాహనాల సమకూర్చన, సెక్టార్ రూట్ మ్యాప్ ల సంసిద్ధత తదితర అంశాలపై ఈ సందర్భంగా కూలంకషంగా సమీక్షించారు. మొత్తం 1,899 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 419 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించడం జరిగిందని, ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, కె.శ్రీనివాస్, డీఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, రాధిక గుప్తా, వైవీ గణేష్, ఉప ఎన్నికల అధికారులు పీయూష్ కుమార్, సంధ్యారాణి, రాధిక గుప్తా, కె.వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల పోలీస్ నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు ఆహ్వానం..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ విద్యాలయాల్లో ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతిలో 2024-25 విద్యా సంవత్సరంలో మిగిలిన సీట్లకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ వెస్ట్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష హాజరు కావాల్సిన వారు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ప్రవేశ పరీక్ష తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సూచించిన పరీక్షా కేంద్రాల్లో ఏప్రిల్ 21న ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్ష పూర్తి వివరాలకు సంబంధించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెబ్సైట్ TSWRIES.IN పరిశీలించాలన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులందరూ వినియోగించుకుని ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ హేమలత తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com